# తొమ్మిదేళ్లలో అగ్రస్థానం

## నిబద్ధత ఉన్న ప్రభుత్వానికి మద్దతివ్వండి



60 ఏండ్లలో జరగని అభివృద్ధి 9 ఏండ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగింది. జగిత్యాలను జిల్లాగా ఏర్పాటు చేయడంతో పాటు, మెడికల్ కాలేజీ, జిల్లా కార్యాలయాలు, ప్రధాన దవాఖాన ఇలా అనేక అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. ఇదంతా సీఎం కేసీఆర్ వల్లనే సాధ్యమైంది. జగిత్యాల నేడు బ్రహ్మాండంగా అభివృద్ధి చెందిన పట్టణం. గతంలో ఏ ప్రభుత్వాలు కూడా ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ఇంతగా పనిచేయలేదు. రానున్న ఎన్నికల్లో నిబద్ధత ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి మద్దతివ్వండి. అప్పుడే జగిత్యాల ప్రాంతంతోపాటు, రాష్ట్ర భవిష్యత్తు గొప్పగా ఉంటుంది. జగిత్యాల మట్టిలో పుట్టిన బిడ్డ ఎమ్మెల్యే సంజయ్ కుమార్. సేవాభావం ఉన్న ఆయన వేలాది కంటి ఆపరేషన్లు చేసి ప్రజలకు చూపు తెప్పించారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధిపై చిత్తశుద్ధి, ప్రేమ కలిగిన ఆయనను మళ్లీ గెలిపించాలి.

**- కొప్పుల ఈశ్వర్, రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, మైనార్టీ, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమ శాఖల మంత్రి**

- దేశంలోనే తెలంగాణ నెంబర్‌వన్
- సీఎం కేసీఆర్ పాలనకు మద్దతు పలుకండి
- హైదరాబాద్‌ను ఐటీకి కేరాఫ్ చేసిన ఘనత మంత్రి కేటీఆర్‌దే
- మైనార్టీలను ఓటు బ్యాంకుగా వాడుకున్నది కాంగ్రెస్
- రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ



ప్రధాన ద్వారం ఎదుట మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీ, పోలీసు అధికారులు

జగిత్యాల, అక్టోబర్ 3(నమస్తే తెలంగాణ) : తొమ్మిదేండ్ల కాలంలోనే దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచిందని, అలా మార్చిన సీఎం కేసీఆర్ పాలనకు మద్దతు పలకాలని రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ పిలుపునిచ్చారు. జగిత్యాలలో నిర్మించిన పోలీసు ప్రధాన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మినీస్టేడియంలో జరిగిన సభలో మాట్లాడారు. తెలంగాణకు కాంగ్రెస్ పార్టీ తీరని నష్టం చేసిందని, ప్రజలను ఇబ్బందులు పెట్టడంతో పాటు ఆంధ్రా ప్రాంతంతో కలిపి గోసపెట్టిందని గుర్తు చేశారు. తెలంగాణ ఇచ్చే సమయంలో ఢిల్లీ నాయకులు తెలంగాణలో 9 జిల్లాలు వెనుకబడి ఉన్నాయని, కరెంట్, నీళ్లు, వనరులు లేవు అని, తెలంగాణ ఎలా అభివృద్ధి చెందుతుందని ప్రశ్నించారనీ, కానీ రాష్ట్ర ఏర్పాటు తర్వాత తొమ్మిదేండ్ల పాలనలోనే దేశంలోనే నంబర్‌వన్ రాష్ట్రంగా తెలంగాణను సీఎం కేసీఆర్ మార్చివేశారన్నారు. విద్యుత్, సాగునీరు, లా అండ్ ఆర్డర్, నిర్మాణాలు, ప్రాజెక్టుల్లో అగ్రస్థానంలో నిలిచిందన్నారు. మంత్రి కేటీఆర్ యువతకు ఆదర్శప్రాయుడని, ఐటీ పరిశ్రమకు హైదరాబాద్‌ను కేరాఫ్‌గా మార్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ప్రపంచ ప్రఖ్యాత కంపెనీల నుంచి పెట్టుబడులను తెస్తూ యువతకు ఉపాధి కల్పిస్తున్న వ్యక్తి అని కొనియడారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ సైతం ప్రజల కోసం కష్టపడి పనిచేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అరవై ఏండ్లలో మైనార్టీలకు ఎలాంటి మేలు చేయలేదని, ఎప్పుడూ ఓటు బ్యాంకుగానే చూసిందన్నారు. తెలంగాణ సాధన తర్వాత ముస్లిం మైనార్టీలకు విద్య, వైద్యం, ఉపాధి కోసం సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని తెలిపారు. మైనార్టీల సంక్షేమం కోసం దేశ బడ్జెట్‌లో కేంద్రం రూ.3 వేల కోట్లు కేటాయిస్తే, తెలంగాణ ఒక్క రాష్ట్రంలోనే మైనార్టీల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.2300 కోట్లు సీఎం కేసీఆర్ కేటాయించారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌కు మద్దతు పలుకుతూ, జగిత్యాల ఎమ్మెల్యేగా డాక్టర్ సంజయ్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు.

## అభివృద్ధి కోసం పనిచేశా.. ఆశీర్వదించండి



పదేండ్లలో జరిగిన అభివృద్ధి అరవై ఏండ్లలో లేదు. 4,520 డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణంతో నా జన్మ ధన్యమైంది. 2017లో నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న సమయంలో అప్పటి ఎంపీ కల్వకుంట్ల కవిత సీఎం కేసీఆర్ వద్దకు తీసుకువెళ్లి జగిత్యాలకు 4,520 ఇండ్లు మంజూరు చేయించారు. లక్ష జనాభా ఉన్న పట్టణంలో 4,520 డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం చేపట్టడమన్నది చాలా గొప్ప విషయం. రాష్ట్ర రాజధాని తదుపరి ఇంత పెద్ద సంఖ్యలో నిర్మించింది జగిత్యాలలోనే. ఇంత గొప్ప మహత్తర కార్యాక్రమాన్ని ముందుండి నడిపించిన ఎమ్మెల్సీ కవిత సమావేశంలో లేకపోవడం బాధగా ఉంది. కాంగ్రెస్, బీజేపీ నాయకులు కుమ్మక్కు అయి కవిత ఓటమికి కారణమయ్యారు. జీవన్‌రెడ్డి సొంత వార్డు, ఆయన తమ్ముడి భార్య, అప్పటి మున్సిపల్ చైర్‌పర్సన్ వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ పాతిక ఓట్లకు పరిమితమైందంటేనే ఆ రెండు పార్టీలు ఎంతగా కుమ్మక్కు అయ్యాయో అర్థం చేసుకోవచ్చు. గత ఎన్నికల్లో నన్ను 60 వేల మెజార్టీతో ఆశీర్వదించా.రు. వారి పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తున్నా. జిల్లా కేంద్రంతోపాటు, మెడికల్ కాలేజీని ఏర్పాటు చేయించాం. జగిత్యాల మాస్టర్ ప్లాన్‌ను అమలు చేసుకునేందుకు నోటిఫికేషన్ ఇచ్చినా, కొందరి స్వార్థం వల్ల రద్దయింది. రైతులకు ఇబ్బందులు లేకుండా జగిత్యాల పట్టణ అభివృద్ధి ప్రణాళికను రూపొందించేలా చూడాలని మంత్రి కేటీఆర్‌ను కోరుతున్నా. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సిస్టం, అతిపెద్ద రైస్‌మిల్లు పరిశ్రమను ఏర్పాటు చేయాలని, మరో వెయ్యి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను మంజూరు చేయాలని, ఉద్యాన్నవన పంటల అభివృద్ధి కోసం చల్‌గల్ వాలంతరి వద్ద యునివర్సిటీ లేదా కాలేజీకి మంజూరు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నా. ఐదేండ్ల కాలంలో కులమతాలకు, పార్టీలకతీతంగా సంక్షేమం, అభివృద్ధి కోసం పనిచేశా. మరోసారి ఆశీర్వదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నా.

**- డాక్టర్ సంజయ్‌కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే**

## నాడు తారక రామానగర్.. నేడు కేసీఆర్ నగర్



దక్షిణ భారతదేశంలో 4,520 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించి ఇవ్వడం అత్యంత అరుదైన విషయం. అందులో విజయం సాధించిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కృషి అభినందనీయం. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, నిర్మాణ వ్యయం చుక్కలను తాకుతున్న తరుణంలో సొంతింటిని నిర్మించుకోవడం ప్రజలకు పెద్ద సమస్యగా మారిన ఈ తరుణంలో ఒకేసారి ఇంత మందికి ఇంటిని నిర్మించి ఇవ్వడం చాలా గొప్ప విషయం. గతంలో తాను ఎమ్మెల్యేగా పనిచేసిన సమయంలో నర్సింగ్ కాలేజీ మంజూరైతే దాన్ని ఏర్పాటు చేయించే విషయంలో డాక్టర్ సంజయ్ ఎంతగానే సహాయపడ్డారు. జిల్లాకొక మెడికల్ కాలేజీ అన్న పాలసీకి సంబంధించి జగిత్యాల జిల్లాకు మొదటి దఫాలోనే అవకాశం కల్పించేలా చేయడంలో ఆయన కృషి ఉంది. గతంలో తెలుగుదేశం హయాంలో తారక రామనగర్ ఎలాగైతే మిగిలిపోయిందో, ఇప్పుడు సంజయ్ హయాంలో కేసీఆర్‌కాలనీ అలా నిలిచిపోతుంది. పేదలకు డబుల్ బెడ్ రూం ఇండ్లను అందించడంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పాత్ర మరువ లేనిది. సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి వల్లే నేను బీఆర్ఎస్‌లో చేరా. నాకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించినందుకు జగిత్యాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నా. ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ యువతకు ప్రతినిధిగా మారిపోయారు.

**- ఎల్ రమణ, ఎమ్మెల్సీ**

# బీఆర్ఎస్‌లోకి మాజీ కౌన్సిలర్



గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మంత్రి కేటీఆర్

రాయికల్/జగిత్యాల అర్బన్, అక్టోబరు 3 : జగిత్యాల పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాలు, ప్రారంభోత్సవాలకు వచ్చిన మంత్రి కేటీఆర్ సమక్షంలో జగిత్యాలలోని కాంగ్రెస్ పార్టీ మాజీ కౌన్సిలర్ దంపతులు బీరబత్తిని శ్రీనివాస్– పద్మజ, ప్రముఖ బిల్డర్ పల్లెర్ల రాజు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## ఆందోళన చెందవద్దు

కొత్తపల్లి, అక్టోబర్ 3: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఐఆర్ 5 శాతం విషయంలో ఉద్యోగులు ఎలాంటి ఆందోళన చెందవద్దని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దారం శ్రీనివాస్‌రెడ్డి, సంగెం లక్ష్మణ్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐఆర్‌తో పాటు ఇతర ఉద్యోగులకు సంబంధించిన సమస్యలపై మంగళవారం టీఎన్జీవోల కేంద్ర సంఘం అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్, ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావును కలిసి ఉద్యోగుల ఆందోళన, ఇతర అంశాలపై వినతిపత్రం ఇవ్వగా ఆయన సానుకూలంగా స్పందించారు. పెండింగ్‌లో ఉన్న డీఏ, ఈహెచ్ఎస్‌కు సంబంధించిన అంశాన్ని త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. టీఎన్జీవో సంఘానికి, ప్రభుత్వానికి మధ్య స్నేహపూర్వకమైన వాతావరణం ఉందని, ఉద్యోగులు తొందరపాటుకు గురికావద్దన్నారు.

# అధునాతన సమీకృత మార్కెట్ ప్రారంభం

- పాల్గొన్న మంత్రులు కేటీఆర్, కొప్పుల ఈశ్వర్, మహమూద్ అలీ, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు



నాన్‌వెజ్ షెడ్‌ను ప్రారంభిస్తున్న హోం శాఖ మంత్రి మహమ్మూద్ అలీ

జగిత్యాల టౌన్, అక్టోబరు 3 : జిల్లా కేంద్రంలోని బీట్‌బజార్ పూర్వ వ్యవసాయ మార్కెట్ యార్డులోని రెండెకరాల్లో పట్టణ ప్రగతి ప్రత్యేక నిధులు రూ.4.50 కోట్లతో నిర్మించిన అధునాతన సమీకృత మార్కెట్‌ను మంత్రి కేటీఆర్ హోం మంత్రి మహమూద్ అలీ, జిల్లా మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్‌కుమార్, విద్యాసాగర్‌రావు, సుంకె రవిశంకర్, మండలి చీఫ్ విప్ భానుప్రసాద్‌రావు, ఎమ్మెల్సీ ఎల్ రమణ, కలెక్టర్ యాస్మిన్ బాషాతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్‌కు వార్డుకౌన్సిలర్ సమిళ్లవాణి శ్రీనివాస్ పుష్పగుచ్ఛంతో ఘనస్వాగతం పలికారు. మొదట కూరగాయల మార్కెట్ కోసం నిర్మించిన షెడ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కూరగాయలు విక్రయిస్తున్న మహిళను సౌకర్యాలు ఎలా ఉన్నాయి అని పలుకరించగా సంతోషంతో పొంగిపోయింది. అనంతరం నాన్‌వెజ్ షెడ్‌ను ప్రారంభించి చేపలు విక్రయిస్తున్న వ్యక్తిని పలుకరించారు.

## అవ్వా.. బాగున్నవా!

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే దాసరి ఆత్మీయ పలుకరింపు

ఎలిగేడు, అక్టోబర్ 3: 'అవ్వా.. బాగున్నవా..పాణం ఎట్లున్నది.' అంటూ ముప్పిరితోటలో ఓ వృద్ధురాలిని ఆత్మీయంగా పలుకరించారు. గ్రామంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఆయన ఓ వృద్ధమహిళ కనిపించగా ఆమె వద్దకు వెళ్లారు. ఆమె చేతులు పట్టుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. పింఛన్ వస్తున్నదా..ప్రభుత్వ పథకాలు మంచిగున్నాయా..అని అడిగితెలుసుకున్నారు.



ఓటర్లను కలుస్తున్న ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ➤